సాక్షి ఒడిశా

సోమవారం । 20 । జనవరి । 2025



**శ్రీమందిరం ఆదాయం లెక్కింపు**

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం ఆదివారం లెక్కించారు. ఇందులో నగదు రూ.6,58,091లు, బంగారం 750 మిల్లీగ్రాములు, వెండి 27గ్రాముల 450 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



**కొనసాగుతున్న పక్షుల గణన**

పక్షుల గణన కొనసాగుతోంది. జయపురంలో ప్రక్రియ నిర్వహిస్తున్నారు.

- 8లో



**అలరించిన నృత్యగీతాలు**

పుష్పుణి మహోత్సవాలు నృత్యాలు ఆకట్టుకున్నాయి. సంప్రదాయ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

- 8లో

## న్యూస్‌రీల్

### మహిళా కళాశాలకు నాక్ గుర్తింపు



మహిళా కళాశాల

**రాయగడ:** స్థానిక మహిళా కళాశాలకు ప్రతిష్టాత్మక నాక్ గుర్తింపు లభించింది. గత కొద్ది రోజుల క్రితం నాక్ బృందం ఈ కళాశాలలో పర్యటించి వసతులు, సాధించిన ప్రగతి, అధ్యాపకులు, విద్యార్థులు సాధించిన ప్రగతి తదితర అంశాలను పరిశీలించారు. ఈ మేరకు కళాశాలకు నాక్ గుర్తించినట్లుగా ప్రకటించింది. త్వరలో ఈ కాళాశాలలో ప్లస్‌త్రీ సైన్స్, కామర్స్ కోర్సులు త్వరలో ప్రారంభించే అవకాశాలు మెండుగా ఉన్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అర్చన పట్నాయక్ తెలియజేశారు. కళాశాలను నాక్ గుర్తించడంపై గవర్నింగ్ బాడీ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

### ఆంధ్ర సంస్కృతి సమితిలో త్యాగరాజ ఆరాధనోత్సవం



పంచరత్న కీర్తనాలాపనలో గాన బృందం

**భువనేశ్వర్:** శ్రీ త్యాగరాజ ఆరాధన మహోత్సవం పురస్కరించుకుని స్థానిక ఆంధ్ర సంస్కృతి సమితి పంచరత్న కీర్తనాలాపన కార్యక్రమం నిర్వహించింది. స్థానిక సంగీతకారులతో ఈ కార్యక్రమం జయప్రదం అయినట్లు సమితి కార్యదర్శి కార్యదర్శి గన్నవరపు లక్ష్మణ రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంగీత కళాకారులు కొలచిన సంగీత (ఖుర్దారోడ్), భువనేశ్వర్ నుంచి గాయత్రీ సదర్శన్, పవన్ కుమార్ కొండూరు, పి. ఆర్. స్వామి, విఘ్నేష్ పంచరత్న కీర్తనాలాపనతో త్యాగరాజ స్వామి వారికి సంగీత ఆరాధన నిర్వహించారని శ్రోతలు కొనియాడారు.

### స్నానపు గదిలో జారిపడి టీటీఈ మృతి



ప్రశాంత కుమార్ దాస్(ఫైల్)

**భువనేశ్వర్:** విధి నిర్వహణలో భాగంగా రాయగడ వెళ్లిన టికెట్ తనిఖీ అధికారి (టీటీఈ) ప్రశాంత కుమార్ దాస్ (56) ప్రమాదవశాత్తు మృతి చెందారు. భువనేశ్వర్ నుంచి 20837 జునాగఢ్ ఎక్స్‌ప్రెస్ రైలులో డ్యూటీ మీద వెళ్లారు. రాయగడ టీటీఈ విశ్రాంతి గదిలో స్నానపు గదిలో జారి పడడంతో మెదడు బలంగా గాయపడింది. రాయగడ ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స చేసి సత్వర ఉన్నత చికిత్స కోసం విశాఖపట్నంలో ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతు తుది శ్వాస విడిచాడు. మృతదేహాన్ని ఆదివారం స్వగ్రామం తరలించారు. అనంతరం పూరీ స్వర్గ ద్వారంలో అంత్యక్రియలు నిర్వహించినట్లు కుటుంబీకులు తెలిపారు. తోటి ఉద్యోగి మృతిపయ అఖిల భారత టికెట్ తనిఖీ సిబ్బంది సంఘం ఐఆర్‌టీసీఎస్ఓ ఖుర్దా రోడ్ మండల శాఖ సభ్యులు సంతాపం ప్రకటించారు. మృతుని కుటుంబీకులకు విధి నిర్వహణలో అకాల మరణం పరిహారం తదితర సహాయాలు సకాలంలో అందజేయాలని రైల్వే శాఖ అధికారులకు అభ్యర్థించారు.

### సీపీఎం నాయకుడి మృతికి సంతాపం



సీపీఎం నాయకులు జగన్నాథ మిశ్రాకు నివాళులు అర్పిస్తున్న వామపక్ష నాయకులు

**పర్లాకిమిడి:** స్థానిక దండుమాల వీధిలో సీపీఎం కార్యాలయంలో ఆదివారం ఉదయం సీపీఎం రాష్ట్ర సంపాదక మండలి సభ్యులు, సీనియర్ నేత జగన్నాథ మిశ్రా ఆకస్మిక మృతిపై సంతాప సభను ఏర్పాటుచేశారు. ఈ సంతాప సభకు అధ్యక్షుడిగా సీపీఎం జిల్లా అధ్యక్షులు దండపాణి రైతో అధ్యక్షత వహించగా, సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్.బంగారి, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా అధ్యక్షులు పైల మురళీకృష్ణ, రైతు సంఘం రైతు కూలీ నాయకులు రొక్కం లోకనాథం తదితరులు పాల్గొని జగన్నాథ మిశ్రాకు శ్రద్ధాంజలి ఘటించారు. గజపతి, గంజాం జిల్లాలో సీపీఎం ఇన్‌చార్జిగా పనిచేసిన జగన్నాథ మిశ్రా బడుగు, ఆదివాసీ కృషక్ మోర్చా ఆందోళనలకు నాయకత్వం వహించేవారని సీపీఎం నాయకులు దండపాణి రైతో అన్నారు.

# భూగర్భంలో .. లిథియం నిక్షేపాలు

- నయాగడ్ జిల్లాలో సంకేతాలు
- జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా సూచన



**భువనేశ్వర్:** రాష్ట్రంలో భూగర్భంలో భారీ లిథియం నిక్షేపాలు ఉన్నాయి. నయాగడ్ ప్రాంతంలో ఈ సంకేతాలు ధ్రువీకరించినట్లు జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ) తెలిపింది. విద్యుత్ వాహనాల (ఈవీ) బ్యాటరీ ఉత్పాదనలో ఈ ఖనిజం ఉపయోగపడుతుంది. ఈవీ బ్యాటరీ వినియోగం కోసం దిగుమతిపై ఆధారపడకుండా దేశీయ ఉత్పత్తిని పెంపుదలకు ఈ వనరులు దోహదపడతాయి. నయాగఢ్ జిల్లాలో విలువైన లిథియం నిక్షేపాలు ఉన్నట్లు ఇటీవలి జియోలాజికల్ సర్వే నివేదికలు సూచించాయి. జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ) ఈ విలువైన ఖనిజ జాడలను గుర్తించినట్లు నివేదికల్లో పేర్కొంది. లిథియం ఖనిజ పదార్థం రంగంలో రాష్ట్రం జాతీయ స్థాయిలో ప్రత్యేక ఉనికిని సొంతం చేసుకుంటుందని ఈ వర్గాలు భావిస్తున్నాయి. ఖనిజ వనరుల రంగాలలో దేశం యొక్క స్వావలంబనను పెంపొందించడానికి కేంద్ర ప్రభుత్వం కీలకమైన ఖనిజాల అన్వేషణకు ప్రాధాన్యత కల్పిస్తుంది. కృత్రిమ మేధస్సు (ఏఐ) ప్రయోగంతో లిథియం నిక్షేపాల గుర్తింపు సన్నాహాలు చేశారు. ఈ సన్నాహాలు ప్రాథమిక దశలో సత్ఫలితాలు సాధించడం విశేషం. ఈ ప్రయత్నాలు మరింత ముమ్మరం చేసే యోచనతో ప్రభుత్వం కృషి చేస్తోంది. ఖనిజ ఆవిష్కరణ విప్లవాత్మక చర్యగా మలిచేందుకు ప్రభుత్వం వినూత్న ప్రయోగాలు చేసేందుకు నడుం బిగించింది. భూగర్భంలో లిథియం, రాగి వంటి విలువైన ఖనిజ వనరులను వెలికితీసేందుకు డ్రోన్‌లతో పాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ప్రయోగం చేపట్టారు. అనేక విలువైన ఖనిజాలకు నిలయమైన మయూర్‌భంజ్ జిల్లాలో నిక్షేపాల గుర్తింపు కోసం ప్రయోగాత్మకంగా కృత్రిమ మేధస్సు ప్రక్రియని ప్రయోగించారు. ఈ ప్రయోగం ఫలప్రదం కావడంతో దక్షిణ ఒడిశాలో ప్రత్యేకంగా కంధమల్, మల్కన్‌గిరి వంటి జిల్లాల్లో ఖనిజ గనుల సర్వేలను చేపట్టాలని ప్రభుత్వం యోచిస్తోంది. జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ) నయాగడ్ జిల్లాలో లిథియం నిక్షపాల అన్వేషణలో ముందంజలో ఉంది. ఒడిశాలో లిథియం నిల్వల ఆవిష్కరణ దేశీయ ఎలక్ట్రిక్ వెహికల్ (ఈవీ) బ్యాటరీ ఉత్పత్తిని పెంచుతుందని భావిస్తున్నారు. లిథియంతో పాటు, ఒడిశాలోని దేవ్‌గఢ్, కెంఝొహర్, మయూర్‌భంజ్‌తో సహా వివిధ జిల్లాలలో బంగారు నిక్షేపాలు ఉన్నట్లు ఇటీవల వార్తలు ప్రసారం అయ్యాయి. తాజాగా లిథియం నిక్షేపాల సమాచారం వెలుగు చూసింది. కోణార్కులో గనుల శాఖల మంత్రుల సమావేశం జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ) ఆధ్వర్యంలో రెండు రోజులపాటు కోణార్కులో దేశవ్యాప్తంగా గనుల శాఖ మంత్రులతో సమావేశం ఏర్పాటు చేయనుంది. ఈ మేరకు సన్నాహాలు చురుకుగా సాగుతున్నాయి. ఈ సందర్భంగా గనుల కార్యకలాపాలలో సామర్థ్యాన్ని పెంపొందించేందుకు కొత్త సాంకేతికతలు, పద్ధతులను అన్వేషిస్తారు. ఈ శిఖరాగ్ర సమావేశం ఫలితాలు భారతదేశం అంతటా మైనింగ్ పద్ధతుల భవిష్యత్‌కు మార్గనిర్దేశం చేస్తాయని జీఎస్ఐ భావిస్తుంది. జాతీయ స్థాయిలో ఈ సమావేశం కలికితు రాయిగా నిలుస్తుంది. రాష్ట్రం గనుల రాజధానిగా జాతీయ స్థాయిలో గుర్తింపు సొంతం చేసుకుందని రాష్ట్ర గనుల శాఖ తెలిపింది. జాతీయ స్థాయిలో సుమారు 50 శాతం ఖనిజాలు రాష్ట్రం నుంచి పలు ప్రాంతాల అవసరాల్ని గట్టెక్కిస్తున్నాయి.

# ముగిసిన క్రీడా పోటీలు




విజేతలను సన్మానిస్తున్న దృశ్యం



వేదికపై ప్రసంగిస్తున్న జయపురం ఎమ్మెల్యే బాహిణీపతి

**జయపురం:** జయపురం విక్రమ విశ్వవిద్యాలయ రెండు దినాల ప్రథమ క్రీడా వార్షికోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి హాజరయ్యారు. క్రీడలు విద్యార్థుల మానసిక, శారీరక ఆరోగ్యానికి దోహదం చేస్తాయన్నారు. ఈ పోటీలలో +2 విద్యార్థుల గ్రూపు పోటీలలో సూరజ్ దిశారి, విద్యార్థినుల గ్రూపులో కల్పణ సాగరియలు చాంపియన్‌లుగా నిలిచారు. డిగ్రీ, పీజీ వర్గ గ్రూపులో విద్యార్థులలో సుమన్ ముదులి, విద్యార్థినుల్లో సంజనీ మరియు చాంపియన్‌లుగా నిలిచారు. ఈ నెల 30, 31వ తేదీల్లో నిర్వహించనున్న పోటీలకు ఇక్కడి విజేతలను పంపించనున్నట్లు విశ్వవిద్యాలయ అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహుమతుల ప్రధాన పోటీలలో విజయం సాధించిన 40 మంది విజేతలకు ట్రోఫీలు అందజేశారు.

# వంతెన నిర్మాణానికి మార్గం సుగమం



వంతెన నిర్మాణం జరగాల్సిన ప్రాంతం



నిర్మాణ పనులు పర్యవేక్షిస్తున్న లక్ష్మీపూర్ ఎమ్మెల్యే పవిత్ర శాంత

**కొరాపుట్:** కాంగ్రెస్ పార్టీకి చెందిన కొరాపుట్ జిల్లా లక్ష్మీపూర్ ఎమ్మెల్యే పవిత్ర శాంత చొరవతో వంతెన నిర్మాణానికి అడ్డంకులు తొలగాయి. ఆదివారం కొరాపుట్ జిల్లా దశమంత్‌పూర్ సమితి ముజంగ గ్రామ పంచాయతీ సందర్శించారు. అక్కడ బల్లిగుడ వద్ద వంతెన నిర్మాణం జరగాల్సి ఉంది. ఆ నిర్మాణం పూర్తయితే సమీప 15 గ్రామాలకు రాకపోకలు జరుగుతాయి. కానీ స్థల సమస్య వల్ల అక్కడ నిర్మాణం పనులు ప్రారంభం కాలేదు. దాంతో ఎమ్మెల్యే సంబంధిత అధికారులు, ప్రైవేటు భూయజమానులు, గ్రామస్తులతో కలసి నిర్మాణ ప్రాంతం వద్దనే సమావేశం నిర్వహించారు. ఎవరికీ నష్టం రాకుండా వంతెన నిర్మాణం పూర్తి చేయడానికి అన్ని వర్గాలను ఒప్పించారు. దాంతో వంతెన నిర్మాణం పనులు ప్రారంభం కానున్నాయి.

# పక్షుల లెక్కింపు



పక్షుల లెక్కింపు బృందం



పడవల్లో ప్రయాణించి లెక్కిస్తున్న దృశ్యం

**రాయగడ:** జిల్లాలోని గుణుపూర్ సబ్ డివిజన్ పరిధిలో గల కెందుగుడ డ్యామ్‌లో అటవీ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం పక్షుల లెక్కింపు చేపట్టారు. గుడారి అటవీ రేంజ్ పరిధిలో గల డ్యామ్ 20 మందితో కూడిన బృందం సుమారు 15 కిలో మీటర్ల దూరం ప్రయాణించి పక్షులను లెక్కించారు. గుణుపూర్ సబ్ కలెక్టర్ కిరణ్ దీప్ కౌర్ సహోట, డీఎఫ్ఓ అన్నా సాహెబ్ ఒహోలే, ఏపీఎఫ్‌లు సందీప్ వృష్టి, సతీష్ కుమార్ ధరువ, రేంజర్ దిలిప్ కుమార్ పటాన్నాయక్‌పాటు అటవీ శాఖ సిబ్బంది ఈ లెక్కింపులో పాల్గొన్నారు. నాలుగు పడవల్లో ప్రయాణించి పక్షులను లెక్కించారు. ప్రతీ ఏడాది శీతాకాలంలో ఇతర ప్రాంతాల నుంచి వలస పక్షులు ఇక్కడకు విడిదిగా వస్తుంటాయి. సుమారు మూడు నెలలపాటుగా ఇక్కడ బస చేసి గుడ్లను పొదుగుతాయి. అనంతరం వాటి పిల్లలతో తిరిగి స్వస్థలాలకు చేరుకుంటాయి. ఈ ఏడాది వివిధ జాతులకు చెందిన సుమారు 981 పక్షులను గుర్తించినట్లు సంబంధిత శాఖ అధికారులు తెలిపారు.

### చేతబడి నెపంతో వృద్ధురాలిపై దాడి



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జాని పక్కనే ఆమె కుటుంబీకురాలు

**రాయగడ:** చేతబడి చేస్తుందన్న నెపంతో వృద్ధురాలిపై దాడి చేసిన ఘటన సదరు పోలీస్ స్టేషన్ పరిధిలో గల మంకొడొజొల గ్రామంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. తీవ్ర గాయాలకు గురైన వృద్ధురాలిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న సదరు పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు, స్థానికులు తెలియజేసిన వివరాల ప్రకారం.. మంకొడొజొల గ్రామంలో నివాసముంటున్న ఖలిమాని జాని అనే వృద్ధ మహిళ చేతబడి చేస్తుందన్న నెపంతో అదే గ్రామానికి చెందిన బలు జొడియా, బిజు జాని అనే ఇద్దరు శనివారం రాత్రి ఒంటరిగా ఇంటిలొ ఉన్న ఖలిమని జానిని బయటకు పిలిచారు. బయటకు వచ్చిన జానిపై కత్తితో దాడి చేసి సమీపంలొ గల నాగావళి నది వద్ద విసిరేశారు. ఆదివారం తెల్లవారున కొంత మంది అటువైపు వెళ్తండగా గాయాలతో వృద్ధురాలు కనిపించింది. దీంతో వారు కుటుంబీకులకు సమాచారం అందించగా వారు వెళ్లి ఆమెను ఆస్పత్రికి తరలించారు.

# ఘనంగా పెండ్రాణి దేవాలయ పునఃప్రతిష్టోత్సవం



పునఃనిర్మించిన పెండ్రాణి దేవాలయం



ప్రతిష్ట కార్యక్రమాలు పర్యవేక్షిస్తున్న వేద పండితులు

**కొరాపుట్:** పెండ్రాణి దేవాలయ పున ప్రతిష్టోత్సవం ఘనంగా జరిగింది. ఆదివారం నబరంగ్‌పూర్ జిల్లాలో ఏకైక శక్తి పీఠం మా బండారు ఘరణి శక్తి పీఠం ఆవరణలో ఈ దేవాలయ ప్రతిష్ట జరిగింది. రాజ పురోహితుడు నర్సింగ త్రిపాఠి నేతృత్వంలో వేద పండితులు ఈ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా సరిహద్దులో ఉన్న ఇంద్రావతి నది నుంచి వందలాది మంది మహిళలు తరలివచ్చి నీటి కలశాలు దేవాలయం వరకు తెచ్చారు.

# 38 ఎకరాల్లో గంజాయి పంట ధ్వంసం



గంజాయి మొక్కలను తగులబెడుతున్న పోలీసులు

**జయపురం:** మల్కన్‌గిరి జిల్లా గడియజొడి పర్వత ప్రాంతాల్లో ఆదివారం 38 ఎకరాల్లో గంజాయి పంటను బొయిపరిగుడ పోలీసులు తగులబెట్టారు. బొయిపరిగుడ పోలీసు అధికారి దీపాంజళి ప్రధాన్ వివరణ ప్రకారం.. బొయిపరిగుడ సమితి దశమంతపూర్ పంచాయతీ గడియజొడి గ్రామ ప్రాంతంలో 38 ఎకరాల్లో గంజాయి పంటను ధ్వంసం చేశారు. గడియజొడి గ్రామ పరిసర ప్రాంతంలో చట్ట విరుద్ధంగా గంజాయి సాగు చేస్తున్నట్లు సమాచారం రావడంతో పోలీసు సబ్‌ఇన్‌స్పెక్టర్ మోతీ సింగ్ నేతృత్వంలో పోలీసు టీమ్‌తో పాటు డీపీఎఫ్ టీమ్‌తో శోధించి పంటను నాశనం చేశామన్నారు. మొత్తం 49, 330 గంజాయి మొక్కలను తొలగించి తగుల బెట్టామని వాటి విలువ రూ.3 కోట్ల 50 లక్షలకు పైచిలుకు ఉంటుందని వెల్లడించారు.



గడియజొడి పర్వత ప్రాంతాలలో పండిన గంజాయి



గంజాయి మొక్కలను తొలగిస్తున్న సిబ్బంది

# ముగిసిన సింగపూర్ అధ్యక్షుని రాష్ట్ర పర్యటన



సింగపూర్ అధ్యక్షుని పర్యటన విశేషాలు వివరించిన ముఖ్యమంత్రి




సింగపూర్ అధ్యక్షునితో రాష్ట్ర ముఖ్యమంత్రి

**భువనేశ్వర్:** సింగపూర్ అధ్యక్షుడు ధర్మన్ షణ్ముగరత్నం రెండు రోజుల రాష్ట్ర పర్యటన ఒక చారిత్రాత్మక ఘట్టమని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి హర్షం వ్యక్తం చేశారు. ఒడిశా రాష్ట్ర ఆవిర్భావం శత వార్షికం వికసిత్ ఒడిషా – 2036 సంకల్ప సాధనకు ఈ పర్యటన పునాదిగా బలపరుస్తుందని ముఖ్యమంత్రి గట్టి నమ్మకం వ్యక్తం చేశారు. సింగపూర్ అధ్యక్షుని పర్యటన ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో మౌలిక సదుపాయాల కల్పన, పెట్టుబడులు, ఉపాధి రంగాల్లో అపారమైన అవకాశాలను కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత కల్పిస్తుంది. ఈ నేపథ్యంలో సింగపూర్‌తో రాష్ట్ర ప్రభుత్వం పలు కీలకమైన అవగాహన ఒప్పందాల్ని కుదుర్చుకుంది. సింగపూర్ అధ్యక్షుని సమక్షంలో రాష్ట్ర ప్రభుత్వం ఎనిమిది ముఖ్యమైన ఒప్పందాల్ని కుదుర్చుకోవడం ప్రగతికి శుభ సంకేతంగా పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉపాధి కల్పనలో భారీ అవకాశాలను కల్పించడంతోపాటు మౌలిక సదుపాయాల కల్పన, పెట్టుబడులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోంది. ఆధునిక పట్టణ ప్రణాళిక, కొత్త నగరాల స్థాపన, ఇండస్ట్రియల్ పార్కులు, సెమీకండక్టర్, పెట్రోకెమికల్, గ్రీన్ ఎనర్జీ మరియు నైపుణ్యాభివృద్ధి వంటి ఆధునిక రంగాల అభివృద్ధికి ఈ ఒప్పందాలు కుదిరాయి. వీటి కార్యాచరణతో రాష్ట్ర అభివృద్ధిని వేగవంతం అవుతుంది. ఆశించిన మేరకు 2036 నాటికి ఒడిశా సుభిక్షంగా ఉంటుందని ముఖ్యమంత్రి తెలిపారు.

స్థానిక వరల్డ్ స్కిల్ సెంటర్ (డబ్ల్యూఎస్‌సి) ప్రాంగణంలో సింగపూర్ అధ్యక్షుడు షణ్ముగరత్నం, ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి, కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, ఉప ముఖ్యమంత్రులు కనక వర్ధన్ సింగ్‌దేవ్ మరియు ప్రభాతి పరిదా సమక్షంలో ఇరు వర్గాల ప్రతినిధులు అవగాహన ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసి ఇచ్చిపుచ్చుకున్నారు. ఈ నేపథ్యంలో జరిగిన ద్వైపాక్షిక చర్చలు ప్రాధాన్యత సంతరించుకుంటాయని తెలిపారు.

**షణ్ముగరత్నంకు వీడ్కోలు**

రెండు రోజుల రాష్ట్ర పర్యటన ముగించుకున్న సింగపూర్ అధ్యక్షుడు ధర్మన్ షణ్ముగరత్నంకు రాష్ట్ర ముఖ్యమంత్రితో పలువురు మంత్రులు ఆత్మీయంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా సింగపూర్ అధ్యక్షుడు ధర్మన్ షణ్ముగరత్నం మాట్లాడుతు ఒడిశా అభివృద్ధిలో కొత్త దశ ఎగుదలకు సిద్ధమైందని, వనరుల సమీకరణతో సామర్థ్యతతో బహుముఖ రంగాల్లో పురోగతి కార్యాచరణతో సుసాధ్యం చేసే దిశలో భావి కార్యాచరణ కొనసాగిస్తుందన్నారు.



ధర్మన్ షణ్ముగరత్నం దంపతులకు వీడ్కోలు పలికిన ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి

## క్లుప్తంగా

### మృతుల కుటుంబాలకు రూ.27 లక్షలు సాయం

**పర్లాకిమిడి:** గజపతి జిల్లా మోహనా బ్లాక్‌లో చిటింగి ఘాటి వద్ద గత డిసెంబరు 11న ఒక పికప్ వ్యాను బోల్తా కొట్టిన సంఘటనలో 9 మంది ప్రయాణికులు మృతి చెందిన సంగతి తెలిసిందే. మృతుల కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఒక్కొక్కరికి రూ.3 లక్షలు చొప్పున 9 మందికి 27 లక్షల రూపాలయ పరిహారాన్ని అందజేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు కలెక్టర్ బిజయ కుమర్ దాస్ తెలిపారు.

### 21న విశ్రాంత వ్యవసాయ విస్తరణ అధికారుల ఆత్మీయ సమావేశం

**శ్రీకాకుళం పాతబస్టాండ్:** జిల్లా విశ్రాంత వ్యవసాయ విస్తరణాధికారుల ఆత్మీయ సమావేశం ఈనెల 11 గంటలకు ఇల్లీసుపురంలోని ప్రభుత్వ పింఛన్‌దారుల సంఘ భవనంలో నిర్వహించేందుకు నిర్ణయించినట్లు సంఘం అధ్యక్షుడు కుంచాల ఆదినారాయణ తెలిపారు. ఈ సందర్భంగా సంఘ సమావేశం ఆదివారం జరిగింది. ఈ ఆత్మీయ సమావేశానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ విస్తరణాధికారుల సంఘ పూర్వ ప్రధాన కార్యదర్శి ఎస్.పాపినాయుడు వస్తున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాల కోసం 9542023405, 8179966304 నంబర్లను సంప్రదించాలని కోరారు. సమావేశంలో నిర్వాహక సభ్యులు కె.తవిటయ్య, డి.నారాయణ రావు తదితరులు పాల్గొన్నారు.

### బ్యూటీపార్లర్ నిర్వహణపై 30 రోజుల శిక్షణ

**ఎచ్చెర్ల క్యాంపస్:** ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలోని 19 నుంచి 45 ఏళ్ల గల 10వ తరగతి విద్యార్హత గల మహిళలకు ఎచ్చెర్లలోని యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో ఉచిత బ్యూటీపార్లర్ నిర్వహణపై 30 రోజుల శిక్షణ నిర్వహించనున్నట్లు డైరెక్టర్ కె.శ్రీనివాసరావు ఆదివారం ప్రకటనలో తెలిపారు. 20వ తేదీ నుంచి శిక్షణ ప్రారంభమవుతుందని, ఆసక్తి ఉన్న వారు 7993340407, 9553410809 నంబర్లను సంప్రదించాలని అన్నారు. శిక్షణ కాలంలో వసతి, భోజనం సౌకర్యాలు ఉచితంగా కల్పించనున్నట్లు చెప్పారు.

### 'తిరుమల ఘటనలకు ప్రభుత్వానిదే బాధ్యత'

**ఇచ్ఛాపురం రూరల్:** కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పవిత్ర పుణ్యక్షేత్రం తిరుమలలో వరుసగా అపచారాలు జరుగుతున్నాయని ఎమ్మెల్సీ నర్తు రామారావు విమర్శించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైకుంఠ ద్వార దర్శనాల దుర్ఘటన, ఇటీవల యాత్రిక సదన్ పైనుంచి పడి మూడేళ్ల బాలుడు మృతి, తర్వాత లడ్డూ కౌంటర్‌లో షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం, రెండో ఘాట్‌లో జరిగిన రోడ్డు ప్రమాదం, ఇప్పుడు ఎగ్ బిర్యానీ వంటి వరుస ఘటనలు తిరుమలలో జరగడం అపవిత్రమని, అందుకు రాష్ట్ర ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని అన్నారు. తిరుమల పవిత్రతను కాపాడుదామంటూ చెప్పిన కూటమి నాయకులు ఇప్పుడు భక్తులకు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. పద్మావతి పార్కులో జరిగిన ప్రమాదంలో ఆరుగురు మృతి చెందితే ఆ కుటుంబాలకు కోటి రూపాయలు ఇవ్వాల్సిన టీటీడీ రూ.25లక్షలు చొప్పున ఇచ్చి చేతులు దులుపుకుందని అసహనం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం, టీడీడీ తిరుమల పవిత్రతను కాపాడాలని కోరారు.

### ఉపాధ్యాయ పండితుల సమస్యల పరిష్కారానికి కృషి

**శ్రీకాకుళం న్యూకాలనీ:** రాష్ట్రంలో ఉపాధ్యాయ పండితుల సమస్యలు పరిష్కారానికి అన్ని చర్యలు తీసుకుంటామని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ శాసనమండలి నియోజకవర్గ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గాదె శ్రీనివాసుల నాయుడు అన్నారు. రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్(రుప్ప) ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల సంయుక్త సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయ పండిత పరిషత్ ప్రతినిధులు తమ ఆకాంక్షలు, అభిప్రాయాలను వెల్లడించారు. గాదెకు సంపూర్ణ మద్దతును ప్రకటిస్తున్నట్లు రుప్ప సంఘ ప్రతినిధులు స్పష్టంచేశారు. కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లా రుప్ప అధ్యక్షులు పి.రంగన్న, ప్రధాన కార్యదర్శి సోయ నాగేశ్వరరావు, గండేపల్లి మల్లేశ,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### భారీ నగదుతో పట్టుబడిన పేకాటరాయుళ్లు

**శ్రీకాకుళం క్రైమ్ :** జిల్లాకేంద్రంలోని హయాతినగరంలో పేకాటరాయుళ్లు పట్టుబడ్డారు. జూదమాడుతున్న 12 మంది వ్యాపారులను పోలీసులు పట్టుకున్నారు. వీరి వద్ద నుంచి రూ.11,13,440 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఒకటో పట్టణ సీఐ సీహెచ్ పైడపునాయుడు తెలిపారు. కాగా, ఇటీవలికాలంలో శ్రీకాకుళం రూరల్, గార, ఆమదాలవలస, ఎచ్చెర్ల పీఎస్‌ల పరిధిలో పేకాట శిబిరాలు జోరుగా నడుస్తున్నాయి. అధికార పార్టీ అండదండలతో అడ్డూఅదుపు లేకుండా శిబిరాలు జరుగుతున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పుడు అది నగరానికి సైతం పాకింది. ఆదివారం హయాతినగరంలో పట్టుబడిన వ్యాపారులు, దొరకని కొంతమంది ఎప్పటినుంచో నగరంలో సైతం రహస్యంగా పేకాట ఆడుతున్నారని, వీరి వెనుక అధికార పార్టీ నాయకుల ప్రమేయం ఉందన్న ప్రచారం గట్టిగా వినిపిస్తోంది. కొందరు పోలీసు సిబ్బంది సహకారంతో వీరికి ఉందన్న విషయం ఇప్పటికే జిల్లా ఉన్నతాధికారి దృష్టికి వెళ్లడం.. ఇప్పటికే ఇలాంటి కార్యకలాపాల్లో ఆరితేరిన సిబ్బంది పోస్టింగ్‌లను వేరే చోటుకు వేయడం జరుగుతోంది.

# కొనసాగుతున్న పక్షుల గణన

- జయపురం అటవీ రేంజ్ పరిధిలో 2,182 పక్షుల గుర్తింపు



మల్కన్‌గిరి: పక్షుల లెక్కింపునకు హాజరైన సిబ్బంది

**జయపురం:** పక్షుల గణన రాష్ట్రంలో కొనసాగుతోంది. జయపురం అటవీ రేంజ్ పరిధిలో పక్షుల లెక్కింపు పూర్తయింది. రేంజ్‌లో 22 జాతులకు చెందిన 2,182 పక్షులు ఉన్నట్లు గణాంకాలలో తేలిందని అటవీ రేంజర్ సచిదానంద పొరిడ వెల్లడించారు. శనివారం ఉదయం ఆరు నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు రేంజ్‌లోని బలియ, ఎల్లో డేమ్, పాత్రోపుట్, మహుళభట్ట జయపురం జగన్నాథ్ సాగర్ మొదలగు అయిదు స్థానాలలో పక్షులు లెక్కింపు జరిగిందని వెల్లడించారు. ఒక్కో ప్రాంతంలో ఆరుగురు అటవీ సిబ్బందితో ఒక్కో టీమ్ ఏర్పాటు చేశామన్నారు. జీపీఎస్, బైనాక్యులర్, వాకీటాకీ, కెమెరా మొదలగు సాధనాలతో పక్షుల లెక్కింపు జరిగినట్లు వెల్లడించారు. పక్షుల లెక్కింపులో పక్షుల ప్రేమికులు, పక్షుల రక్షకులు, పక్షుల వైజ్ఞానికులు, అటవీ సిబ్బంది పాల్గొన్నారన్నారు. 2024లో జయపురం రేంజ్‌లో కేవలం 526 పక్షులు ఉండేవని 2025లో 22 జాతులకు చెందిన 2,182 పక్షలు ఉన్నాయని వెల్లడించారు. గత ఏడాదికంటే ఈ సంవత్సరం 1556 పక్షులు ఎక్కువగా ఉన్నట్లు పేర్కొన్నారు. వీటిలో నాలుగు విదేశీ పక్షులను అటవీ సిబ్బంది గుర్తించారన్నారు. అవి ఉత్తర భారత దేశం, చైనా, మలేషియ నుంచి వచ్చినట్టు అనుమానిస్తున్నట్టు పేర్కొన్నారు. పక్షుల లెక్కింపులో జయపురం అటవీ డివిజన్ అధికారి ప్రతాప్ బెహర విక్రమదేవ్ విశ్వవిద్యాలయ విజ్ఞాన విభాగ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉదయకుమార్ దాస్, యూనివర్సిటీ విద్యార్థులు సహకరించారని రేంజర్ సచిదానంద పొరిడ వెల్లడించారు.



జయపురం: జయపురం రేంజ్‌లో పక్షులు



మల్కన్‌గిరి: జలాశయంలో విదేశీ పక్షులు

**సత్తిగూడ జలాశాయంలో..**

**మల్కన్‌గిరి:** మల్కన్‌గిరి జిల్లా కేంద్రానికి పది కిలోమీటర్ల దూరంలో ఉన్న సత్తిగూఢ జలాశాయంలో పక్షుల గణనను ఆదివారం చేపట్టారు. జిల్లా అటవీశాఖ అధికారి ప్రతాప్ కోత్తపల్లి ఆదేశాలతో భూవనేశ్వర్ నుంచి వచ్చిన పక్షుల గణన నిపుణులు, జిల్లా అటవీశాఖకు చెందిన 30 మంది సిబ్బందితో నాలుగు బోట్లలో ఉదయం ఆరు గంటల నుంచి 34 రకాల పక్షులను లెక్కించారు. డ్రోన్ కెమోరాలు, బైనాక్యులర్లతో గుర్తించారు. అదనపు అటవీశాఖ అధికారి సంరక్షణలో 3,517 పక్షులను లెక్కించారు. వాటిలో 22 దేశీయ, 12 విదేశీ పక్షుల రకాలు ఉన్నాయి.

వీటిలో 542 నీటిముక్కి పక్షులు, 498 హంసారళి, 480 చిన్ననీటిపక్షులు, 330 కామన్‌పోచార్డ్, 119 కామన్‌పిగ్మీగూస్, 320 బగ్స్, 198 రెడ్‌క్రెస్టెడ్ పక్షులను గుర్తించారు. వీటితో పాటు బడబగ్, రాణీ బగ్, గెండాలియా, ఖైరాపిచ్ పక్షులు ఉన్నాయి. గణన కార్యక్రమంలో ప్రియా, కమహుకా, రేంజర్ రమోష్ రావత్, గార్డ్ దిబాకార్ జేనా, ఇతర ఉద్యోగులు ఉన్నారు.

## పంచాయతీ ఉద్యోగి చేతివాటం

- సొంత జేబులోకి ట్రేడ్ లైసెన్స్ ఫీజు డబ్బులు
- మరి కొంత మంది నుంచి ఇంటి పన్ను పేరు మార్పుల కోసం డబ్బులు వసూళ్లు
- నాలుగు నెలలుగా విధులకు డుమ్మా



**టెక్కలి:** టెక్కలి మేజర్ పంచాయతీకి చెందిన ఉద్యోగి ఒకరు తన చేతివాటాన్ని ప్రదర్శించి ట్రేడ్ లైసెన్స్‌కు వసూలు చేసిన ఫీజు డబ్బులను సొంత జేబులోకి వేసుకున్నాడు. ఈ వ్యవహారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అయితే ప్రస్తుతం నిందితుడు నాలుగు నెలలుగా విధులకు డుమ్మా కొట్టడం మరింత చర్చనీయాంశమైంది. వివరాల్లోకి వెళితే...టెక్కలి మేజర్ పంచాయతీలో కారుణ్య నియామకంలో భాగంగా హేమంత్ అనే యువకుడు స్వీపర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఆ యువకుడు కాస్త చదువుకోవడంతో, పంచాయతీకి సంబంధించి ట్రేడ్ లైసెన్స్ వసూళ్ల బాధ్యతలను అప్పగించారు. దీంతో అతడు ట్రేడ్ లైసె న్స్ ఫీజులను వసూలు చేసి సొంత అవసరాలకు వినియోగించుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న పంచాయతీ అధికారులు మందలించి రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. సొంత అవసరాలకు వినియోగించుకున్న సొమ్మును తక్షణమే పంచాయతీకి చెల్లించాలని అధికారులు ఆదేశించి కొంత గడువును ఇచ్చారు. అయినప్పటికీ పంచాయతీకి చెల్లించాల్సిన డబ్బులు చెల్లించకపోగా అక్టోబర్ నెల నుంచి నేటి వరకు విధులకు హాజరు కాకపోవడం ప్రస్తుతం పంచాయ తీ కార్యాలయంలో చర్చనీయాంశంగా మారింది. ఇదిలా ఉండగా ట్రేడ్ లైసెన్స్ వసూలు చేస్తున్న హేమంత్‌కు తమ ఇంటి పన్ను పేరు మార్పుల కోసం డబ్బులు ఇచ్చామని ఆయన ఆచూకీ లేదంటూ కొంత మంది పంచాయతీకి చెందిన ప్రజలు తరచూ అధికారు లకు ఫిర్యాదులు చేస్తున్నారు. పంచాయతీ సిబ్బంది హేమంత్ వ్యవహారంపై ఇప్పటికే జిల్లా స్థాయి పంచాయతీ అధికారులతో పాటు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఈఓ జగన్నాథం వెల్లడించారు. ఇదిలా ఉండగా గతంలో పంచాయతీ ఇంటి పన్నుల వసూళ్ల విషయంలో కొంత మంది సిబ్బంది ఇదే మాదిరిగా లక్షల రూపాయలు గోల్ మాల్ చేశారు. మళ్లీ ఇప్పుడు అదే సీన్ రిపీట్‌గా మారింది. తాజాగా జరిగిన వ్యవహారంపై కొంత మంది వార్డు సభ్యులు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయడానికి సిద్ధమవుతున్నారు.

## బుడుమూరులో మురుగునీటిపై ఆరా

**ఎచ్చెర్ల:** లావేరు మండలం బుడుమూరులో పారిశుద్ధ్య పనులు నిర్వహించాలని డీఎల్‌పీవో ఇప్పిలి వెంకటరమణ సిబ్బందిని ఆదేశించారు. మురుగునీరు పేరుకుపోవడంతో ఇబ్బందులు పడుతున్నామంటూ బీసీ కాలనీవాసులు శనివారం కాలువలో దిగి ధర్నా చేసిన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన అధికారులు ఆదివారం గ్రామానికి వెళ్లి పారిశుద్ధ్య పరిస్థితిపై ఆరా తీశారు. ఈ సందర్భంగా డీఎల్‌పీవో మాట్లాడుతూ ఇక్కడ కాలువనీరు బయటకు పోయేందుకు ఇబ్బందులు ఉంటే వెంటనే పరిష్కరించాలన్నారు. మురుగునీరు లేకుండా పారిశుద్ధ్య పనులు కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అప్పలనాయుడు, స్థానిక నాయకులు చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

## జీడిపిక్కలకు గిట్టుబాటు ధర కల్పించాలి



సమావేశంలో పాల్గొన్న జీడి రైతులు

**పలాస:** ఉద్దానం ప్రాంత జీడి రైతులకు ఇచ్చిన ఎన్నికల హామీని పూర్తిస్థాయిలో అమలు చేయాలని జీడి రైతాంగ పోరాట ప్రతినిధులు డిమాండ్ చేశారు. బైపల్లి గ్రామంలో కోనేరు కామేశ్వరరావు అధ్యక్షతన ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీడి మద్దతు ధర విషయంలో ఈ ప్రాంత ప్రజాప్రతినిధులు తక్షణమే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి కార్యరూపం దాల్చేలా చొరవ తీసుకోవాలని కోరారు. వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుతో జీడి పిక్కల గిట్టుబాటు ధర విషయంలో చర్చలు జరపడానికి స్థానిక ఎమ్మెల్యే గౌతు శిరీషా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జీడి రైతు సంఘం కన్వీనర్ తెప్పల అజయ్‌కుమార్, కోనేరు రమేష్, బత్తిన లక్ష్మీనారాయణ, అంబటి రామకృష్ణ, కొర్ల హేమారావు చౌదరి, వాసుపల్లి సాంబమూర్తి, జోగి అప్పారావు, తెప్పల చాణుక్య, బొంపెల్లి శివకుమార్, గుల్ల ఈశ్వర రావు, సానా కృష్ణారావు, తామాడ పోలయ్య తదితరులు పాల్గొన్నారు.

## సవరణ జీఓ 117లో లోపాలు సరిదిద్దాలి

**శ్రీకాకుళం న్యూకాలనీ:** జీఓ 117 సవరణలో లోపాలను సరిదిద్ది విద్యావ్యవస్థను కాపాడాలని, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్.వి.రమణమూర్తి, జి.రమణమూర్తి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆదివారం శ్రీకాకుళంలో ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోడల్ ప్రైమరీ స్కూల్ పంచాయతీ కేంద్రంగా ఏర్పాటు చేయడం శుభపరిణామమే అయినా సమీప పాఠశాలల నుంచి మూడు, నాలుగు, ఐదు తరగతులను మోడల్ ప్రైమరీ స్కూల్లో కలపకుండా వాటిని పాతపద్ధతిలో ప్రైమరీ స్కూల్‌గానే కొనసాగించాలని కోరారు. మోడల్ ప్రైమరీ స్కూలు పంచాయతీ కేంద్రంగా ఉండాలని, అప్‌గ్రేడ్ కాకుండా మిగిలిన యూపీ స్కూలును యథావిధిగా కొనసాగించాలన్నారు. అన్ని ఉన్నత పాఠశాలలో హెడ్మాస్టర్, పీఈటీ పోస్టులు ఉండాలని, ఎంటీఎస్ ఉపాధ్యాయులకు పదవీ విరమణ వయసు 62 ఏళ్లకు పెంచాలని కోరారు. విద్యాశాఖామంత్రి దృష్టికి సమస్య తీసుకెళ్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.శ్రీనివాసరావు, ఎం.తేజేశ్వరరావు, డీవీఎన్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.



ఎంపిక ప్రక్రియకు హాజరైన అభ్యర్థినులు(ఫైల్)

## ఆసక్తి తగ్గిందా..?

**ఎచ్చెర్ల క్యాంపస్:** పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగం అంటే చాలా మంది యువతకు ఇదివరకు దీర్ఘకాలిక స్వప్నంలా ఉండేది. ఏపీ పోలీస్ రిక్రూట్‌మెంట్ నిర్వహిస్తున్న ఈ ఎంపిక ప్రక్రియ ప్రస్తుతానికి రెండు దశలు దాటింది. ప్రిలిమినరీ పరీక్ష, దేహ దారుఢ్య పరీక్ష, ఇక చివరి రాత పరీక్ష మాత్రమే ఉంది. ప్రిలిమినరీ పరీక్ష అర్హత సాధించిన వారు చాలా మంది ఫిజికల్ టెస్టులకు హాజరు కాలేదు. తుది పరీక్షకు ఎంపికైన వారి సంఖ్య కూడా తక్కువగా ఉంది. ఎక్కువ మందికి ఆసక్తి లేకపోవడం వల్లే గైర్హాజరైన వారి సంఖ్య అధికంగా ఉందని చాలా మంది భావిస్తున్నారు.

వాస్తవంగా కానిస్టేబుల్ పోస్టులకు ఇంటర్మీడియెట్ అర్హత కాగా, ఇంజినీరింగ్, పీజీ, డిగ్రీ చేసిన వారు సైతం దరఖాస్తు చేసుకున్నారు. చాలా మంది ఎంపిక ప్రక్రియకు హాజరయ్యారు. దేహ దారుఢ్య పరీక్షలు ఎచ్చెర్ల ఆర్మ్‌డ్ రిజర్వ్ మైదానంలో డిసెంబర్ నెల 30 నుంచి ఈ నెల 18వ తేదీ వరకు సెలవు రోజుల్లో మినహా నిర్వహించారు. జిల్లా నుంచి ప్రిలిమినరీ పరీక్షల్లో పురుష, మహిళా అభ్యర్థులు 7390 మంది అర్హత సాధించారు. వీరిలో దేహ దారుఢ్య పరీక్షలకు 4952 మంది మాత్రమే హాజరయ్యారు. 2951 మంది తుది రాత పరీక్షకు ఎంపికయ్యారు. ప్రిలిమినరీ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన 2438 మంది దేహ దారుఢ్య పరీక్షలకు ఎంపిక కాలేదు. గతంలో అభ్యర్థులను స్క్రూట్నీ చేయటం కోసం ఐదు కిలో మీటర్లు అర్హతగా పరీక్ష నిర్వహించేవారు. 25 నిమిషాల్లో ఐదు కిలోమీటర్ల పరుగు పందెంలో విజేతలకు ఇతర దేహ దారుఢ్య పరీక్షలు నిర్వహించి రాత పరీక్ష ద్వారా ఎంపిక చేసేవారు. ప్రస్తుతం ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహణ ద్వారా స్క్రూట్నీ చేశారు. వీరికి ఎత్తు, ఛాతీ కొలత, 1600 మీటర్లు, 100 మీటర్లు, లాంగ్ జంప్ నిర్వహించి అర్హత సాధించిన వారికి తుది పరీక్ష నిర్వహించి, ఉద్యోలకు రిజర్వేషన్ రోస్టర్, కొన్ని పోస్టులకు స్పోర్ట్సు మెరిట్, రాత పరీక్ష ప్రతిభ ఆధారంగా ఎంపిక చేస్తున్నారు. ప్రధానంగా ఎక్కువ మంది అభ్యర్థులు ఎత్తు, ఛాతీ కొలత, 1600 మీటర్లు పరుగు పందేంలో అర్హత సాధించ లేకపోయారు. పోలీస్ కానిస్టేబుల్ ఎంపిక ప్రక్రియలో నిర్వహించిన ఎంపిక ప్రక్రియ అన్ని దశలు దాటి వెళ్లాలి. ఎంపికపై స్పష్టమైన నమ్మకం లేని వారు హాజరు కాలేదు. మరోపక్క కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన పలు ఆర్మ్‌డ్ ఫోర్స్ ఉద్యోగాలకు వెళ్లిపోయారు. దీంతో గైర్హాజరు సంఖ్య ఎక్కువగా ఉందని నియామక ప్రక్రియలో పాల్గొన్న అధికారులు బావిస్తున్నారు. మరో పక్క ఎంపికైన అభ్యర్థులు కోచింగ్ సెంటర్లలో శిక్షణ, ఆన్‌లైన్ శిక్షణ, బయట ప్రాంతాల్లో గదులు అద్దెకు తీసుకొని ప్రిపరేషన్ ప్రారంభించారు. ఉద్యోగం సాధించాలంటే ఇప్పటికీ తీవ్ర పోటీ ఎదుర్కోవాల్సి ఉంటుంది.

## రూ.లక్ష ఆర్థిక సాయం అందజేత

**గార:** మండలంలోని బూరవిల్లి గ్రామానికి చెందిన డిక్కల పద్మలోచన, వినీత దంపతుల చిన్న కుమారుడు చేతన్ గుండె వ్యాధితో, పెద్ద కుమారుడు శశాంక్ పేగు సంబంధిత వ్యాధితో బాధపడుతుండటంతో సాయం చేసేందుకు దాతలు ముందుకొచ్చారు. గ్రామస్తులు, యువత, స్నేహితులు సేకరించిన లక్ష రూపాయలను ఆదివారం కుటుంబ సభ్యులకు అందజేశారు. చిన్నారులకు దీర్ఘకాలిక వ్యాధులు సోకడంతో తల్లిదండ్రులు పడుతున్న ఇబ్బందులపై 'హృదయ వేదన' పేరిట సాక్షిలో ఈ నెల 11న కథనం ప్రచురితమైంది. సంక్రాంతి సమయాల్లో కూడా విశాఖపట్నం ఆసుపత్రిలో ఉండటంతో ఆదివారం బూరవిల్లి వచ్చిన తల్లి వినీతకు సేకరించిన నగదును అందజేశారు. ఇప్పటివరకు రూ.10 లక్షల మేర ఖర్చు చేయడం, ఇంకా రూ.20 లక్షలు వరకు అవుతుందని వైద్యులు చెబుతుండటంతో ఆందోళన చెందుతున్నారు. బోరవానిపేట సత్యసాయి భజనమండలి సభ్యులు రూ.50వేలు అందజేశారు. కార్యక్రమంలో ఎం.జనార్దన్, జి.ధర్మారావు, మల్ల రామారావు, ఎం.గోపి, మాధవనాయుడు, అయ్యప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి ఎఫెక్ట్



వినీతకు నగదు అందజేస్తున్న బూరవిల్లి గ్రామస్తులు

## అపూర్వ కలయిక

స్థానిక మహారాజా బాలుర ఉన్నత పాఠశాలలో చదివిన 1983 విద్యార్థులు సభ్యులు కలుసుకున్నారు. గురువులుతో కలిసి ఆనందం పంచుకున్నారు. దేశంలో అనేక చోట్ల వృత్తి పరంగా స్థిరపడిన వారంతా ఆదివారం బి.ఎ న్.ప్యాలస్‌కు చేరుకుని ఆనందంగా గడిపారు.

– పర్లాకిమిడి



1983 పదో తరగతి బ్యాచ్

# విద్యార్థులకు వక్తృత్వ పోటీలు



విజేతలతో ట్రస్టు సభ్యులు

**రాయగడ:** స్థానిక సాయిప్రియ నగర్‌లో గల సాయిప్రియ వెల్ఫేర్ ట్రస్టు ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం ట్రస్టు కార్యాలయం ప్రాంగణంలో వివిధ పాఠశాలల విద్యార్థులకు వకృత్వ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశ్రాంత హెచ్‌ఎం ప్రశాంత కుమార్ పట్నాయక్ ముఖ్యఅతిథిగా, ఉపాధ్యాయురాలు సస్మిత మహంతి గౌరవ అతిథిగా హాజరయ్యారు. వివిధ పాఠశాలకు చెందిన 25 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. దీక్షిత బొల్లి ప్రథమ, గాయత్రీ కుంబార్ ద్వితీయ, సుజాత నాయక్ తృతీయ స్థానాల్లో నిలిచారు. గణతంత్ర దినోత్సవ విశిష్టతను వక్తలు వివరించారు. ట్రస్టు కార్యదర్శి దయానంద ఖడంగ ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి. సభ్యులు టి.ఎన్.రావు, మహేశ్వర పాణిగ్రహి, అరుణ్ కుమార్ సాహు, తదితరులు పాల్గొన్నారు.

# అలరించిన నృత్య గీతాలు



వేదికపై ఎమ్మెల్యే బాహిణీపతి తదితరులు

**జయపురం:**

కొరాపుటియ కళ, కళాకార మంచ్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న పుష్పుణి మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శనివారం రాత్రి నిర్వహించిన నృత్య సంగీతాలు ప్రేక్షకులను మైమరపించాయి. ముఖ్యంగా ఆదివాసీ నృత్యాలు, సంప్రదాయ వాయిద్యాలతో పాడిన పాటలు ప్రేక్షకులను రంజింప చేశాయి. కళాకార్ మంచ్ అధ్యక్షుడు మనోజ్ పాత్రో అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మంచ్ కార్యదర్శి ధిరెన్ మోహనపట్నాయక్, బీఎస్ఎఫ్ డీఐజీ సత్యభాన కంజి, అతని ధర్మపత్ని డాక్టర్ చేతన కంజి, జయపురం బీడీవో శక్తి మహాపాత్రో, జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సశ్మిత మెలక పాల్గొన్నారు.



సంప్రదాయ వాయిద్య పరికరాతో పాటలు పాడుతున్న ఆదివాసీ కళాకారులు



ప్రేక్షకులను అలరించిన ఆదివాసీ డాన్స్

# మృత్యువులోనూ వీడని స్నేహబంధం

- రోడ్డు ప్రమాదంలో ఇద్దరు ఒడిశా యువకులు మృతి
- మరో ముగ్గురికి గాయాలు
- అతివేగమే ప్రమాదానికి కారణం



రోడ్డుపై పడి ఉన్న స్నేహితుల మృతదేహాలు

**ఇచ్ఛాపురం:** అతివేగం ఇద్దరు ప్రాణస్నేహితులను ప్రాణాలను బలిగొంది. ఇచ్ఛాపురం పట్టణంలోని సంతపేట వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం చెందగా.. మరో ముగ్గురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా పాత్రపూర్ బ్లాక్ బొరివాడా గ్రామానికి చెందిన కాసులదేవి కార్తీక్(23), బొనసోలా గ్రామానికి చెందిన ఇసురు వినోద్(22) స్నేహితులు. కార్తీక్ హైదరాబాద్‌లో వెల్డర్‌గా, వినోద్ స్వగ్రామంలోనే మెకానిక్‌గా పని చేస్తున్నారు. సంక్రాంతి పండగ కోసం సొంతూరికి వచ్చిన కార్తీక్ ఒడిశాలో కొత్త బైక్‌ని కొనుగోలు చేశాడు. నంబర్‌ప్లేట్ కోసం ఆదివారం స్నేహితుడు వినోద్‌తో కలిసి బరంపురం వెళ్లాడు. అక్కడ పనులు ముగించుకొని తిరిగి ఇంటికి వస్తుండగా ఇచ్ఛాపురం పట్టణంలో సంతపేట వద్దకు చేరేసరికి అతివేగంతో బైక్‌ని నడపడంతో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టారు. అవతలవైపు రోడ్డులోకి సైతం దూసుకుపోయి మరో ద్విచక్రవాహనంపై వస్తున్న సోంపేట మండలం మాకన్నపురం గ్రామానికి చెందిన చిత్రాడ రమేష్, సిద్దార్థ, పలాస మండలం తాలబద్రకు హనుమంత్ కార్తీక్‌లను ఢీకొట్టారు. ఈ ఘటనలో ఒడిశాకు చెందిన ఇద్దరు స్నేహితులు అక్కడికక్కడే మృతిచెందగా రమేష్, హనుమంతు కార్తీక్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. సిద్దార్థకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు స్పందించి క్షతగాత్రులను 108 అంబులెన్సులో ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పట్టణ పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. హెచ్‌సీ అప్పారావు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

## క్లుప్తంగా

### ఆడలి వ్యూపాయింట్ రహదారి పరిశీలన



ఇటీవల యాక్సిడెంట్ జరిగిన మలుపును పరిశీలిస్తున్న పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి

సీతంపేట: మండలంలోని ఆడలి వ్యూపాయింట్ మార్గంలో ఉన్న రహదారి మలుపులను ఐటీడీఏ పీఓ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి పరిశీలించారు. ఈనెల 18న ఆహ్లాదం మాటున విషాదం శీర్షికన ఘాట్ రోడ్‌లో మలుపులతో పాటు ఇటీవల ఆడలి వ్లోే మార్గంలో జరిగిన వరుస రోడ్డు ప్రమాదాలపై సాక్షిలో వచ్చిన కథనంపై ఆయన స్పందించారు. ఈ మేరకు ఎక్కడెక్కడ మలుపులు ఉన్నాయో స్వయంగా చూశారు. రహదారి విస్తరణ, మలుపుల వద్ద రక్షణ గోడల నిర్మాణానికి ఎంత ఖర్చు అవుతుందో ప్రతిపాదనలు తయారు చేయాలని ట్రైబల్ వెల్ఫేర్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని చెప్పారు. జలుబుగూడ గ్రామానికి రహదారి నిర్మాణానికి కూడా ప్రతిపాదించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈ నాగభూషణరావు పాల్గొన్నారు.

### తోటపల్లి ఈఈ రామచంద్రరావుకు ఉద్యోగోన్నతి

- పోలవరం హెడ్‌వర్క్స్ సర్కిల్ ఎస్ఈగా నియామకం



రెడ్డి రామచంద్రరావు

విజయనగరం అర్బన్: తోటపల్లి ప్రాజెక్ట్ రాజాం డివిజన్ ఈఈ రెడ్డి రామచంద్రరావుకు సూపరింటెండెంట్ ఇంజినీర్ (ఎస్ఈ)గా పదోన్నతి లభించింది. ఇరిగేషన్ శాఖలో ఖాళీగా ఉన్న ఎస్ఈ. పోస్టులకు ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన పదోన్నతుల జాబితాలో ఆయన పేరును పేర్కొంది. పదోన్నతి అధికారులకు పోస్టుల కేటాయింపులు కూడా తాజాగా జరిగాయి. పోలవరం హెడ్ వర్క్స్ సర్కిల్ ఎస్ఈగా రామచంద్రరావుకు నియామకాలు విడుదలయ్యాయి. ఈఈ కేడర్‌లో వివిధ ప్రాంతాల్లో 12 సంవత్సరాలు పనిచేసిన అనుభవం ఆయనకు ఉంది. రాజాం డివిజన్ ఈఈగా 10 ఏళ్లు, వంశధార ప్రాజెక్టు హిరమండలం డివిజన్ ఈఈగా ఒక సంవత్సరం పనిచేశారు. అంతకుముందు విశాఖలోని నార్త్ కోస్టు చీఫ్ ఇంజినీర్ కార్యాలయంలో డిప్యూటీ చీఫ్ ఇంజనీర్‌గా ఒక సంవత్సరం పనిచేశారు.

### ఇద్దరు నిందితులకు రిమాండ్



మాట్లాడుతున్న సీఐ రామకృష్ణ పక్కన ఎస్సై వెంకటసురేష్

పాచిపెంట: మండలంలోని పాంచాలి గ్రామంలో పాంచాలి ఉమామహేశ్వరరావు అనే వ్యక్తిని గాయపరిచి, అతని వద్ద ఉన్న సెల్‌ఫోన్, నగదు మరికొందరి దగ్గర నగదు, సెల్‌ఫోన్‌లను దొంగిలించిన కేసులో ఇద్దరు నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రామకృష్ణ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన పాచిపెంట పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై వెంకటసురేష్‌తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడుతూ ఈ నెల 16న ఉమామహేశ్వరరావుపై జరిగిన దాడి, దోపిడీ కేసులో ఉనుకూరు జోసెఫ్, మోసూరు శివలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. వారు దోచుకున్న సెల్‌ఫోన్లను, నగదును దాడి సమయంలో ఉపయోగించిన ఆయుధాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

### డ్రైనేజీలో పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

విజయనగరం క్రైమ్: స్థానిక దాసన్నపేట రైతు బజార్ దగ్గరలో ఉన్న డ్రైనేజీలో గుర్తు తెలియని వ్యక్తి పడి మృతిచెందినట్లు టూటౌన్ సీఐ శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. మృతుడికి సుమారు 35 నుంచి 40 ఏళ్ల వయసు ఉంటుందని, మృతుడి చేతిపై ఆదిలక్ష్మి అనే పచ్చబొట్టు ఉందని చెప్పారు. మృతదేహాన్ని జిల్లా కేంద్రాస్పత్రికి తరలించామని, ఆచూకీ తెలిసిన వారు ఫోన్ 9121109420, 9121109438 నంబర్లను సంప్రదించాలని కోరారు.

### 300 సారా ప్యాకెట్ల పట్టివేత



పట్టుకున్న సారా ప్యాకెట్లు చూపిస్తున్న పోలీసులు

సాలూరు: పట్టణంలో సారా ప్యాకెట్లు కలిగి ఉన్న ఒడిశాకు చెందిన మహిళను పట్టుకున్నట్లు పట్టణ పోలీసులు తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు ఎరుకుల వీధి జంక్షన్ వద్ద 30 లీటర్లు (300 ప్యాకెట్లు)తో ఉన్న ఒడిశా రాష్ట్రానికి చెందిన మహిళను ఆదివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని చెప్పారు. సారా,ఇతర మత్తు పదార్థాలు రవాణా చేసినా, క్రయ విక్రయాలు చేసిన చట్టప్రకారం చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



శంబర పోలమాంబ అమ్మవారు



ఘటాలకు పూజలు చేస్తున్న భక్తులు

# భక్తులతో.. కిటకిటలాడిన పోలమాంబ ఆలయం

- సుదూర ప్రాంతాలనుంచి ఆలయానికి చేరుకున్న భక్తులు
- అమ్మవారి ఘటాలకు ప్రత్యేక పూజలు
- మొక్కులు తీర్చుకున్న భక్తులు

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారిని ఆదివారం భక్తులు దర్శించుకునేందుకు రావడంతో చదురుగుడి భక్తులతో కిటకిటలాడింది. వచ్చే సోమవారం నుంచి అమ్మవారి జాతర ప్రారంభంకావడంతో రద్దీ ఎక్కువగా ఉండే అవకాశమున్నందున సుదూర ప్రాంతాలనుంచి భక్తులు అధికసంఖ్యలో ఆలయానికి చేరుకున్నారు. అంతేకాకుండా ఆదివారం సెలవుదినం కావడం, సోమవారం నుంచి పాఠశాలలు తెరుచుకోనుండడంతో భక్తులు ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. చీరలు, ఘటాలు, కోళ్ల మొక్కుబడులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈవో వి.వి. సూర్యనారాయణ చర్యలు చేపట్టారు.

**అమ్మవారి ఘటాలకు ప్రత్యేక పూజలు**

చదురుగుడిలోని అమ్మవారి ఘటాలకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఘటాలకు చీరలు చూపించి, తలపై అమ్మవారి ఘటాలను ఎత్తుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం 3గంటల తరువాత అమ్మవారి ఘటాలను గ్రామంలోని అన్ని పురవీధుల్లో ఊరేగించారు.



మొక్కుతీర్చుతున్న చిన్నారి

# అంగన్వాడీ సహాయకుల నియామకానికి నోటిఫికేషన్

- 11 పోస్టుల భర్తీ
- ఐసీడీఎస్ పీడీ డా. టి. కనకదుర్గ



ఐసీడీఎస్ పీడీ డా. టి. కనకదుర్గ

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మన్యం జిల్లాలో వివిధ ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ సహాయకుల పోస్టుల నియామకానికి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఐసీడీఎస్ పీడీ డా.టి. కనకదుర్గ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలోని పాలకొండ డివిజన్‌లో సీతంపేట ప్రాజెక్టు పరిధిలో రెండు, భామిని ప్రాజెక్టు పరిధిలో ఒక పోస్టు, కురుపాం ప్రాజెక్టు పరిధిలో ఆరు, పార్వతీపురం డివిజన్‌లో పార్వతీపురం ప్రాజెక్టు పరిధిలో ఒకటి, సాలూరు ప్రాజెక్టు పరిధిలో ఒకటి అంగన్వాడీ సహాయకుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వాటి భర్తీకి నోటిఫికేషన్ జారీ చేశామని చెప్పారు. 11 అంగన్వాడీ సహాయకుల పోస్టుల ఖాళీలను షెడ్యూల్ ట్రైబల్ హ్యాబిటేషన్ గ్రామాలను అనుసరించి షెడ్యూల్ ట్రైబల్ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని పిలుపునిచ్చారు.

**ఐసీడీఎస్ ప్రాజెక్టు ఒక యూనిట్‌గా**

ఐసీడీఎస్ ప్రాజెక్టు ఒక యూనిట్‌గా పరిగణించి కేటగిరిని నిర్ధారించి పోస్టులను ప్రకటించామన్నారు. స్థానికంగా స్థిర నివాసం కలిగిన అర్హులైన వివాహిత మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నామన్నారు. దరఖాస్తులను జనవరి 27వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు సంబంధిత ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు. ఇంటర్వ్యూ తేదీ, స్థలం తదుపరి తెలియజేయనున్నట్లు తెలిపారు.

**నిబంధనలు తప్పనిసరి**

అంగన్వాడీ సహాయకుల నియమకానికి స్థానిక స్థిర నివాసం కలిగిన వివాహిత మహిళ అయి ఉండాలి. 2024 జూలై 1వ తేదీ నాటికి 21 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలి. ఎస్టీ కేంద్రాలకు ఎస్టీ కేటగిరికి రోస్టరులో రిజిస్టర్ అయిన పోస్టులకు 21 సంవత్సరాలు నిండిన అభ్యర్థులు లేని పక్షంలో 18 సంవత్సరాలు నిండిన వారిని కూడా పరిగణనలోకి తీసుకోనున్నట్లు ఐసీడీఎస్ పీడీ కనకదుర్గ చెప్పారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన వారు అర్హులని, 10వ తరగతి పాస్ అయిన వారు లేకపోతే దాని కన్నా తక్కువ విద్యార్హత కలిగిన వారిని పరిగణనలోకి తీసుకోనున్నామన్నారు.

**బోనస్ మార్కులు ఇలా..**

10వ తరగతి పరీక్ష ఉత్తీర్ణత అయిన అభ్యర్థులకు 50 మార్కులు, ప్రీస్కూల్ టీచర్/కృషి/ప్రీస్కూల్ మేనేజ్‌మెంట్ ఇంటర్‌మీడియట్ బోర్డు, గుర్తింపు పొందిన యూనివర్సిటీ ద్వారా పొందిన సర్టిఫికెట్ కలిగిన వారు లేదా ఈసీఈ వర్కర్‌గా పనిచేస్తున్న వారికి 5 మార్కులు, వితంతువులకు 5 మార్కులు, మైనార్టీ తీరని పిల్లలు కలిగిన వితంతువులకు 5 మార్కులు, పూర్తి అనాథ, బాలసదన్ ప్రభుత్వ సంస్థలలో నివసించి మంచి నడవడిక, సత్ప్రవర్తన సర్టిఫికెట్ కలిగినవారికి 10 మార్కులు, అర్హత కలిగిన దివ్యాంగులకు 5 మార్కులు, మౌఖిక ఇంటర్వ్యూకు 20 మార్కులు వెరసి వంద మార్కులకు పరిగణించనున్నట్లు ఐసీడీఎస్ పీడీ కనకదుర్గ వివరించారు.

# ఏరియా ఆస్పత్రిలో వ్యక్తి ఆత్మహత్య

- పోస్టుమార్టం వద్దన్న కుటుంబసభ్యులు
- నచ్చజెప్పిన పోలీసులు



పోస్టుమార్టం గది వద్ద మృతుని బంధువులకు నచ్చజెబుతున్న ఆస్పత్రి వర్గాలు, పోలీసులు



ఏరియా ఆస్పత్రిలో ఉరి వేసుకుని ఆత్మ హత్య చేసుకున్న జోగినాయుడు

పాలకొండ రూరల్: కడుపు నొప్పితో పలుమార్లు ఆస్పత్రుల్లో చేరి చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి తన ఆరోగ్య సమస్య తీవ్రతను తట్టుకోలేక ఆస్పత్రిలోనే ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పాలకొండలో జరిగిన ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నియోజకవర్గంలోని వీరఘట్టం మండలం తలవరం గ్రామానికి చెందిన బెవర జోగినాయుడు(45) రెండేళ్లుగా తీవ్ర కడుపు నొప్పి(పాంక్రియాటిస్) సమస్యతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో పలు ఆస్పత్రుల్లో వైద్యం పొందినా ఆరోగ్యం మెరుగుపడలేదు. తాజాగా శనివారం మరోమారు నొప్పిరావడంతో వేకువజామున జోగినాయుడు తన భార్య కల్యాణితో కలిసి పాలకొండ ఏరియా ఆస్పత్రిలో చేరాడు. వైద్యసేవలు పొందుతూ అర్ధరాత్రి దాటిన తరువాత మేల్ వార్డు సమీపంలో ఉన్న బాత్‌రూమ్‌కు వెళ్లి తన వద్ద ఉన్న తువ్వాలుతో కిటికీకి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం తెలవారు జామున సహచర రోగులు ఈ విషయం గమనించి వార్డులో ఉన్న మృతుడి భార్యకు తెలియజేశారు. ఆస్పత్రి వర్గాలు పోలీసులకు సమాచారం అందించగా ఆస్పత్రికి వచ్చారు. విషయం తెలుసుకున్న మృతుని బంధువులు ఆస్పత్రికి చేరుకుని జోగినాయుడు మృతదేహానికి పోస్టుమార్టం చేయవద్దని, అలాగే అప్పగించాలని ఓవైపు ఆస్పత్రి, మరోవైపు పోలీసులతో వాదులాటకు దిగారు. పాలకొండ సీఐ మీసాల చంద్రమౌళి ఆస్పత్రికి చేరుకుని ఎంఎల్‌సీ (మెడికో లీగల్ కేస్) నమోదైన క్రమంలో అధికార వర్గాలకు సహకరించాలని వారికి నచ్చజెప్పి పోస్టుమార్టం పూర్తి చేయించారు. అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు ఏఎస్సై నారాయణ తెలిపారు. మృతునికి భార్యతో పాటు కుమారుడు వెంకటేష్, కుమార్తె సూర్యకళ ఉన్నారు. వ్యవసాయ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్న జోగినాయుడు సొమ్ముడని, ఆ కుటుంబం పెద్దదిక్కు కోల్పోవడం పట్ల గ్రామస్తులు తమ ఆవేదన వ్యక్తం చేశారు.

### ప్రజాశాంతికి భంగం కలిగిస్తే కఠినచర్యలు

- ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: జిల్లాలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగి ప్రజాశాంతికి భంగం కలిగిస్తే కఠినచర్యలు తప్పవని ఎస్పీ వకుల్ జిందల్ మందుబాబులను హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో మందు తాగే వారిపై చట్టప్రకారం చర్యలు చేపట్టేందుకుగాను ఆదివారం జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్ చేపట్టామని తెలిపారు. లేఅవుట్లు, గ్రామ, నగర శివారు ప్రాంతాల్లో బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగిన వారిపై దాడులు చేసి ప్రజలకు ఇబ్బందులకు గురిచేస్తున్న 252 మందిపై కేసులు నమోదు చేశామని చెప్పారు. జిల్లావ్యాప్తంగా ఆకస్మికంగా వాహన తనిఖీలను చేపట్టి, పశువులను, మద్యం అక్రమంగా తరలిస్తున్న వారిపై రెండు కేసులు నమోదుచేసి, ఇద్దరిని అరెస్టు చేసి వారి నుంచి 8 మద్యం బాటిల్స్, నాలుగు పశువులు, ఒక వ్యాన్ సీజ్ చేశామన్నారు. వాహన తనిఖీల్లో రహదారి భద్రత నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులపై 386 కేసులు నమోదుచేసి, రూ. 95 వేల 205 ఈ చలానా విధించామని తెలిపారు. సంతకవిటి పోలీస్‌స్టేషన్ పరిధిలో పేకాట ఆడుతున్న వారిపై దాడులు చేసి, నలుగురిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.16వేల 80 రూపాయలు నగదు సీజ్ చేశారన్నారు.

# యూరియా కరువు

- అరకొరగా సరఫరా
- ఎరువు కోసం రైతుల అవస్థలు



గరివిడి మండలంలో సాగవుతున్న మొక్కజొన్న పంట

చీపురుపల్లిరూరల్(గరివిడి): ప్రతి ఏడాదీ యూరియా సమస్య రైతులను వెంటాడుతోంది. ప్రభుత్వాలు మారినా, పాలకులు మారినా రైతులకు యూరియా పూర్తిస్థాయిలో అందించలేకపోతున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల గరివిడిలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు సైతం యూరియా అందుబాటులో ఉండడం లేదని, యూరియా కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పంటల ఎదుగుదలకు యూరియా చాలా అవసరం. అలాంటి యూరియా సకాలంలో అందుబాటులో లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. గరివిడి మండలంలో 21 రైతు సేవాకేంద్రాలు ఉన్నాయి.వాటితో పాటు కాపుశంభాం, కోనూరు, తాటిగూడ, గొట్నంది గ్రామాల్లో సొసైటీలు ఉన్నాయి. గతంలో రైతు భరోసా కేంద్రాల వ్యవస్థ రాకముందు యూరియా సొసైటీల ద్వారా పూర్తిస్థాయిలో రైతులకు అందించేవారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతుభరోసా కేంద్రాల వ్యవస్థను నెలకొల్పిన తరువాత గ్రామాల్లో ఉండే రైతు భరోసా కేంద్రాల నుంచి నేరుగా ఎరువులను అందించే సౌకర్యం కల్పించింది. దీంతో గ్రామాల్లో ఉండే రైతులకు పట్టణాలకు పోయి ఎరువులను కొనుగోలు చేసే కష్టాలు తగ్గినట్లయ్యింది. ఇదిలా ఉండగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రబీ సీజన్‌లో సొసైటీల్లోగాని, రైతు సేవా కేంద్రాల్లో గాని యూరియా కావాల్సినంత ఉండడం లేదని, ఈ కారణంగా యూరియా కోసం ఇబ్బందులు పడాల్సి వస్తోందని రైతులు చెబుతున్న మాట. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ముందస్తుగానే యూరియా అందుబాటులో ఉండేదని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రైతు భరోసా కేంద్రాల్లోను, సొసైటీల్లో యూరియా అందుబాటులో ఉంటే ప్రభుత్వం నిర్ణయించిన రూ.266లకు యూరియా అందేదని, ప్రభుత్వ కార్యాలయాల్లో అందుబాటులో లేకపోవటంతో ఓపెన్ మార్కెట్‌లో కొనుగోలు చేయాల్సిన పరిస్థితి వస్తోందని చెబుతున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో యూరియా అందుబాటులో లేకపోయినా బయట మార్కెట్లో విచ్చలవిడిగా దొరుకుతోందని, ఒక్కో యూరియా బస్తాకు అదనంగా 50 నుంచి 80 రూపాయలు వెచ్చించి కొనాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు.

**పంట ఎదుగుదలకు యూరియానే ఆధారం**

ఖరీఫ్, రబీ సీజన్‌లలో పంట ఎదుగుదల కోసం రైతులు ఎక్కువగా యూరియాపైనే ఆధార పడతారు. ఎప్పటిలాగానే ఈ ఏడాది రబీ సీజన్‌లో 3000 ఎకరాల్లో అధిక విస్తీర్ణంలో మొక్కజొన్న పంటను సాగుచేశారు. మొక్కజొన్నతో పాటు ఇతర రకాల కూరగాయలు, మిరప, అపరాలు, బొప్పాయి, వేరుశనగ తదితర రకాల పంటలతో కలిపి 5వేల ఎకరాలకు పైబడే సాగుబడి చేశారు. ఖరీఫ్‌లో కంటే రబీ సీజన్‌లోనే మొక్కజొన్న పంటను సాగుచేసేందుకు రైతులు ముందడుగు వేస్తారు.రబీ సీజన్‌లో సాగుచేసిన పంట నుంచి దిగుబడులు అనుకూలంగా రావడం కారణంగా రైతులు మొక్కజొన్నను ప్రధానపంటగా సాగు చేస్తారు. మొక్కజొన్నతో పాటు ఇతర పంటలకు యూరియానే ప్రధాన ఆధారం. యూరియా సకాలంలో పంటకు అందించకపోతే పంట ఎదుగుదల లోపిస్తుందని చెప్తున్నారు. యూరియాను రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులోనికి తీసుకువస్తున్నప్పటికీ ఏమాత్రం సరిపోవడం లేదని, పంటల సాగుకు సరిపడే విధంగా యూరియాను అందుబాటులోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.

### యూరియా కోసం రైతుల ఇబ్బందులు

యూరియా కోసం రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. మొక్కజొన్న పంటకు యూరియా చాలా అవసరం. యూరియా అందుబాటులో లేకపోతే రైతు పంటను నష్టపోతాడు. సకాలంలో యూరియా రావడం లేదు.ఏదో సమయంలో యూరియా లోడు పంపించినా రైతులకు సరిపోవడం లేదు. సరిపడేంత యూరియా అందబాటులో లేకపోవటంతో రైతులు అవస్థలు పడుతున్నారు.రైతుల సాగుకు సరిపడేలా యూరియా అందుబాటులో ఉంచాలి.

– గుడివాడ తమ్మినాయుడు, సర్పంచ్, వెదుళ్లవలస

### 24 టన్నుల యూరియాను అందించాం

రబీసీజన్‌లో రైతులు సాగు చేసిన పంటలకు అనుగుణంగా మొదట విడతలో 12 టన్నుల యూరియాను, రెండో విడతలో 12 టన్నుల యూరియాను రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులోకి తీసుకువచ్చి రైతులకు అందించాం. మూడో విడత యూరియా కోసం ప్రతిపాదనలు చేశాం. యూరియా వచ్చాక రైతుసేవా కేంద్రాల్లో అందుబాటులోకి తీసుకువస్తాం. రైతులు కూడా మోతాదుకు మించిన యూరియాను వినియోగిస్తున్నారు. ఇలా యూరియాను వినియోగించడం వల్ల పంటకే నష్టం జరుగుతుందని రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. మోతాదుకు మించి వినియోగిస్తున్నందున కూడా యూరియా కొరత ఏర్పడుతోంది.

– శైలజ, మండల వ్యవసాయాధికారి, గరివిడి మండలం

# అమిత్ షా గో బ్యాక్

- ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద వామపక్ష పార్టీల నిరసన



ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద నిరసన తెలుపుతున్న వామపక్షాల నాయకులు

విజయనగరం ఫూల్ బాగ్: అంబేడ్కర్‌పై అనుచితమైన వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా విజయవాడ పర్యటనను నిరసిస్తూ స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద సీపీఎం, సీపీఐలు ఆధ్వర్యంలో ఆదివారం నిరసన చేపట్టాయి. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ, సీపీఐ(ఎంఎల్)జిల్లా నాయకుడు బెహరా శంకరరావులు మాట్లాడుతూ..రాజ్యాంగాన్ని, అవమానించి, అంబేడ్కర్‌పై అనుచితమైన వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా నైతికంగా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్ అమ్ముతున్నా కేంద్ర ప్రభుత్వంలో కీలక పాత్ర పోషించిన అమిత్ షా రాష్ట్రానికి వస్తే టీడీపీ, జనసేన నేతలు స్వాగతం పలకడం సిగ్గుచేటన్నారు. ప్రజలంతా అమిత్ షా పర్యటనను వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వామపక్షాల నాయకులు రెడ్డి శంకరరావు, టీవీ రమణ, ఎం. అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

# కూల్చిన చోటే నీడ కల్పించాలి

- బాధితుల వేడుకోలు



షెడ్డు తొలగించిన చోటనే చలిలో రాత్రి కూడా నివాసం ఉంటున్న బాధిత కుటుంబం

బొండపల్లి: తమకు అసరాగా 13 సంవత్సరాలుగా ఉన్న రేకుల షెడ్డును తొలగించిన స్థానంలోనే తనకు నీడను కల్పించాలని కోరుతూ బాధిత కుటుంబం అక్కడే చలిలోనే నాలుగు రోజులుగా కాలం వెళ్లదీస్తున్నారు. మండలంలోని గొల్లలపేట గ్రామానికి చెందిన పీతల చంటిబాబు గ్రామానికి సమీపంలో రేకుల షెడ్డును సెంటున్నర స్థలంలో 13 సంవత్సరాల క్రితం వేసుకుని అక్కడే నివాసం ఉంటూ జీవనం సాగిస్తున్నాడు. అయితే ఇటీవల రెవెన్యూ అధికారులు ప్రభుత్వ స్థలంలో రేకుల షెడ్డు వేసుకున్నాడని చెప్పి నోటీసులు జారీ చేసి షెడ్డును పొక్లెయిన్‌తో బలవంతంగా తొలగించారు. కేవలం రాజకీయ కారణాలతోనే తన షెడ్డును తొలగించారని ఇదే సర్వే నంబర్‌లో ప్రభుత్వ భూమి అని చెబుతున్న దానిలో నీలగిరి మొక్కలు వేసుకుని సాగు చేస్తున్న రైతును ఎందుకు తొలగించలేదని, అలాగే మండలంలో చాలా చోట్ల అక్రమణలు ఉన్నా తనపై కక్షగట్టి తొలగించడం దారుణమని వాపోతున్నాడు. తనకు న్యాయం చేసి తాను రేకుల షెడ్డు వేసుకుని జీవనం సాగిస్తున్న చోటనే తనకు నీడ కల్పించాలని కోరుతూ బాధితుడు కుటుంబంతో సహా అక్కడే రాత్రీపగలు చలిలో కాలం వెళ్లదీస్తున్నాడు. ప్రభుత్వం, అధికారులు తనకు న్యాయం చేయాలని లేకుంటే అంతవరకు షెడ్డు తొలగించిన స్థలం నుంచి కదిలేది లేదని తెగేసి చెబుతున్నాడు.

### ఆమె నేత్రాలు సజీవం

- మృతిచెందిన 85 ఏళ్ల వృద్ధురాలి నుంచి నేత్రాల సేకరణ



ఇందుమతి నుంచి కార్నియా సేకరిస్తున్న దృశ్యం

రాజాం సిటీ: ఆమె మరణించినప్పటికీ ఆ కళ్లు ప్రపంచాన్ని చూడగలవు. అన్ని అవయవాల్లోకి నయనం ప్రధానం అని నమ్మిన కుటుంబసభ్యులు నేత్రదానానికి ముందుకు వచ్చారు. మున్సిపాల్టీ పరిధి అమ్మవారికాలనీకి చెందిన చెక్కా ఇందుమతి (85) ఆదివారం వేకువజామున మృతిచెందారు. ఈ విషయాన్ని కుటుంబసభ్యులు రాజాం రెడ్‌క్రాస్ సభ్యులు కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, పెంకి చైతన్యకుమార్‌ల ద్వారా రెడ్‌క్రాస్ జిల్లా అధ్యక్షుడు జగన్మోహనరావుకు తెలియజేశారు. దీంతో స్పందించిన ఆయన మగటపల్లి కల్యాణ్ నేత్రసేకరణ కేంద్రం టెక్నీషియన్ పూతి సుజాత, ఉమల ద్వారా ఆమె నేత్రాలను సేకరించారు. ఈ సందర్భంగా రాజాం రెడ్‌క్రాస్ సభ్యులు మాట్లాడుతూ నేత్రదానం మహాదానమని, ప్రతి ఒక్కరికీ కుటుంబ సంప్రదాయం కావాలని పిలుపునిచ్చారు. ఒకరి నేత్రాలు ఇద్దరి జీవితాల్లో వెలుగులు నింపుతాయని పేర్కొన్నారు. ప్రస్తుత కాలంలో నేత్రదానంపై అవగాహన పెరుగుతోందన్నారు. అంధత్వ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ తమవంతు కృషిచేయాలని కోరారు. నేత్రదానానికి ముందుకు వచ్చిన చెక్క గున్నరాజు, ఎ.భాస్కర్, అరుణ, రమణమ్మలను అభినందించారు.

# వరిచేను కుప్పలు దగ్ధం

- సుమారు రూ.3లక్షలు వరకు ఆస్తినష్టం
- భోరున విలపిస్తున్న రైతులు



విలపిస్తున్న బాధిత రైతులు



కాలిపోతున్న వరిచేను కుప్పలు

తెర్లాం: మండలంలోని సుందరాడ గ్రామంలో ఆదివారం సాయంత్రం జరిగిన అగ్ని ప్రమాదంలో 140 బస్తాల దిగుబడినిచ్చే నాలుగు వరిచేను కుప్పలు పూర్తిగా దగ్ధమయ్యాయి. ప్రమాదానికి సంబంధించి బాధిత రైతులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన రేజేటి లక్ష్మం, ముత్తా నగేష్, కుసుమూరు పెంటయ్య, ముత్తా తిరుపతి అనే రైతులు సంక్రాంతి పండగ ముందు వరిచేను కోసి, గ్రామానికి సమీపంలో ఉన్న పణుకు రాయిపై కుప్పలు వేశారు. సంక్రాంతి పండగ అయిన తరువాత వరిచేను నూర్పులు చేసుకోవచ్చని భావించారు. అయితే ఆదివారం సాయంత్రం జరిగిన అగ్నిప్రమాదంలో నాలుగు వరిచేను కుప్పలు పూర్తిగా దగ్ధమయ్యాయి. సుమారు 140 బస్తాల వరకు ధాన్యం దిగుబడి వచ్చేదని, సుమారు రూ.3లక్షల వరకు నలుగురు రైతులకు నష్టం వాటిల్లిందని బాధిత రైతులు, గ్రామస్తులు అంటున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన వరిచేను అగ్నికీలలకు ఆహుతైపోయిందని, చేతికంది వచ్చిన పంట బూడిదైపోయిందని బాధిత రైతులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. నలుగురు రైతులకు సంబంధించిన నాలుగు వరిచేను కుప్పల్లో ఒక్క ధాన్యం గింజ కూడా మిగలకుండా పూర్తిగా కాలిపోవడంతో వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అగ్నిప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు రాజాంలోని అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించడంతో సిబ్బంది శకటంతో వచ్చి మంటలను అదుపు చేశారు. సకాలంలో అగ్నిమాపక సిబ్బంది, గ్రామస్తులు స్పందించి మంటలను అదుపు చేయడంతో పక్కనే ఉన్న మరికొన్ని వరిచేను కుప్పలకు ఎటువంటి ప్రమాదం వాటిల్లలేదు.

### మిమ్స్ విద్యార్థి ఆత్మహత్య

నెల్లిమర్ల: తమ కుమారుడు వైద్య వృత్తిలో స్థిరపడతాడని ఆ తల్లిదండ్రులు ఎంతో సంబరపడిపోయారు. మరికొన్ని రోజుల్లో ఎంబీబీఎస్ పట్టా పుచ్చుకుని, రోగులతో పాటు తమకు కూడా వైద్యసేవలు అందిస్తాడని ఆశ పడ్డారు. అయితే వారి ఆశలు అడియాసలయ్యాయి. చేతికి అందివచ్చిన కొడుకు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఎంబీబీఎస్ రెండో సంవత్సరం నుంచి బ్యాక్‌లాగ్స్ ఉండిపోవడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. పోలీసులు, సహ విద్యార్థులు అందించిన వివరాల ప్రకారం.. నెల్లిమర్ల పట్టణంలో ఉన్న మిమ్స్ వైద్య కళాశాలలో తూర్పు గోదావరి జిల్లా నిడదవోలుకు చెందిన అతుకూరి సాయి మణిదీప్(24) ఎంబీబీఎస్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. ఆదివారం ఉదయం కళాశాల ప్రాంగణంలో ఉన్న హాస్టల్ గదిలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆన్‌లైన్‌లో పురుగుల మందు తెప్పించుకుని, కూల్ డ్రింకులో కలుపుకుని తాగాడు. విషయం తెలుసుకున్న సహ విద్యార్థులు విషయాన్ని మిమ్స్ యాజమాన్యానికి తెలియజేశారు. యాజమాన్య ప్రతినిధులు నెల్లిమర్ల పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ గణేష్ తమ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. సాయి మణిదీప్ బెడ్ కింద పోలీసులకు సూసైడ్ నోట్ లభించింది. చదువు విషయంలో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు సదరు నోట్‌లో మృతుడు ప్రస్తావించాడు. బ్యాక్ లాగ్స్ ఎక్కువగా ఉండటం, చదువుపై ఏకాగ్రత లేకపోవడంతో చనిపోతున్నట్లు రాసాడు. సూసైడ్ నోట్ ఆధారంగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గణేష్ తెలిపారు.